క్లుప్తంగా

10న ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అవోపా మిట్టా వెంకట కృష్ణయ్య భవన్‌లో ఈనెల 10న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు అవోపా ప్రతినిధులు తెలిపారు. నేత్ర వైద్యుడు ఎస్.గురు అభిలాష్, దంత వైద్యుడు ఎం.శ్రావణ్ కుమార్ వైద్య సేవలు అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరి నూర్పిళ్లను వాయిదా వేసుకోండి

చాపాడు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి నూర్పిళ్లను రైతులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. మండల పరిధిలోని సోమాపురం, మొర్రాయిపల్లె గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఎవరైనా నూర్పిళ్లు చేసి ఉంటే ధాన్యం వర్షపు నీటిలో తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచాలన్నారు. అధిక వర్షాలు పడితే నీటి నిలువ లేకుండా నీరు బయటికి వెళ్లిపోయేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధాన్యం తడిస్తే మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు.

వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి మార్గశిర మాసం సందర్భంగా ప్రముఖ పంచ వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకా తిరుమల, అంతర్వేది (శ్రీలక్ష్మీనరసింహస్వామి), గొల్లలమామిడాల (శ్రీకోందడరామస్వామి), అప్పనపల్లి (బాలబాలాజీ), అన్నవరం (శ్రీసత్యనారాయణస్వామి పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు. ఈనెల 13, 20, 27 తేదీల్లో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు డిపో నుంచి బస్సు బయలు దేరుతుందని, సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.3,200 రానుపోను నిర్ణయించినట్లు తెలిపారు. కృతిక నక్షత్రం సందర్భంగా నవరాత్రులు అరుణాచలం కొండపైన అఖండ దీపం వెలుగుతుందని, ఈ సందర్భంగా ఈనెల 14, 22 తేదీల్లో ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. అరుణాచలంకు డైరెక్ట్‌గా సూపర్ లగ్జరీ బస్సు రానుపోను చార్జి రూ.1250, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.1450 అని తెలిపారు. రిజర్వేషన్ కొరకు 9966525210 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలి

ప్రొద్దుటూరు: ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులపై ఒత్తిడి లేని విద్యను అందించాలని, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో కంప్లెయింట్ సెల్ ఏర్పాటు చేయాలని, సమస్యలను స్కూల్ ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్‌లో పొందుపరిచి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

పోలీసుల అదుపులో పప్పీ హత్య కేసు నిందితులు?

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులో హత్యకు గురైన రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీ హత్య కేసులోని నిందితులు లోకేశ్వరరెడ్డి, సునీల్‌లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితులను కడపలో విచారిస్తున్నట్లు సమాచారం. ప్రొద్దుటూరులోని సంజీవనగర్‌కు చెందిన పప్పీని సుందరాచార్యుల వీధిలోని బీజీఆర్ లాడ్జిలో సోమవారం వేకువ జామున మద్యం సీసాలతో కొట్టి చంపిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగిన వెంటనే లాడ్జీ గదిలో ఉన్న యనమల లోకేశ్వరరెడ్డి, సునీల్‌లు పరారయ్యారు. అప్పటి నుంచి వారి కోసం పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు క్రైం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని, వ్యాధి నిర్మూలనపై విస్తృత ప్రచారం చేయాలని గీతం జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక గీతం జూనియర్ కాలేజీ, దొరసానిపల్లె జెడ్పీహైస్కూల్‌లో చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితుల్లో ధైర్యం నింపేందుకు, హెచ్ఐవీ వ్యాధిపై అవగాహన కలిగించేందుకు ప్రతి ఏటా డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

చాపాడు: వ్యాయామం చేయడం వలన ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని మిస్టర్ ఇండియా బాడీ బిల్డర్ రాజారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఫ్రెండ్స్ జిమ్ పాయింట్'ను బుధవారం ప్రొద్దుటూరుకు చెందిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ.. జిమ్ కేంద్రాలు ఇది వరకూ పట్టణాలు, నగరాల్లో ఉండేవని, మండల కేంద్రమైన చాపాడులో జిమ్ ఏర్పాటు చేయటం మంచి పరిణామన్నారు.

పేదల బియ్యం పక్కదారి

- నిద్రమత్తులో రెవెన్యూ యంత్రాంగం
- బ్లాక్ మార్కెట్‌కు తరలివెళుతున్న వైనం



కలసపాడు: పేదలకు అందాల్సిన నిత్యావసర సరుకులు కలసపాడు మండలంలో పక్కదారి పడుతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా అమలు పరచాల్సిన రెవెన్యూ యంత్రాంగం ప్రతి నెల మామూళ్ళ మత్తులో మూలుగుతుండటంతో మండలంలో ప్రజాపంపిణీ వ్యవస్థ గాడితప్పింది. ప్రతి నెల లక్షలాది రూపాయలు విలువైన పేదల నిత్యావసర సరుకులు రేషన్‌షాపు డీలర్లు యథేచ్ఛగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో 17 చౌకదుకాణాలు, 10,059 రేషన్‌కార్డు లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుండగా చక్కెర, కందిపప్పు, రాగులు, జొన్నలు కూడా పంపిణీ చేస్తుంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలోని పలు చౌకదుకాణాలను టీడీపీ మద్దతుదారులు బలవంతంగా కైవసం చేసుకున్నారు. ప్రతి నెల పేదలకు సక్రమంగా నిత్యావసర సరుకులు అందించాల్సి ఉండగా చౌకదుకాణదారులు అరకొరగా పంపిణీ చేసి గ్రామంలో లేనటువంటి వారి కార్డులు, మృతిచెందిన వారి కార్డులను తొలగించకుండా గ్రామ రెవెన్యూ అధికారులు తమ లాగిన్ ద్వారా డీలర్లకు లబ్ధి చేకూరుస్తున్నారు.

బెంగళూరు, హైదరాబాద్‌కు తరలింపు

మండలంలోని పలువురు డీలర్లు పేదలకు అందించాల్సిన ఈ నిత్యావసర సరుకులను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి అధిక ధరకు అమ్ముకుంటూ కొంత భాగాన్ని రెవెన్యూ అధికారులకు ముట్టచెబుతున్నారు. మండలం నుంచి రేషన్ బియ్యం ప్రైవేటు బస్సుల ద్వారా బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు తరలివెళుతున్నాయి. ప్రతి నెల అందించాల్సిన కందిపప్పు లబ్ధిదారుల నుండి లాగిన్ ఫింగర్ వేయించుకుని స్టాకు లేదు, మరో నెల అందజేస్తామని మాయమాటలు చెప్పి చౌకదుకాణదారులు కందిపప్పును బయట మార్కెట్‌కు తరలిస్తున్నారు. రేషన్ దుకాణాలపై పర్యవేక్షణ కొనసాగించి సక్రమంగా అమలు పరచాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఏమాత్రం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రతి నెల మండలంలో లక్షలాది రూపాయలు విలువైన నిత్యావసర సరుకులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చౌకదుకాణాలను పర్యవేక్షించి లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థినుల ప్రతిభ



జాతీయస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థునులతో స్పెషలాఫీసర్

అట్లూరు: జాతీయస్థాయి ఆటల పోటీలకు అట్లూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యార్థినులు ఎంపికయ్యారని ఆపాఠశాల స్పెషలాఫీసర్ పణిశ్రీ,, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీలా తెలిపారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అండర్–14, అండర్–17, అటియా పాటియా క్రీడా పోటీలలో ఎంపిక అయ్యారన్నారు. సాఫ్ట్ బాల్‌కు లక్ష్మిప్రన్న, బేస్‌బాల్‌కు తనూజ, అటియా పాటియా క్రీడలో దీపిక, అమరావతి, రిషితా, సుధా ఎంపికయ్యారని తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



ఊరేగింపులో అయ్యప్ప ఉత్సవ విగ్రహం



ఊరేగింపులో దీపాలు, కళశాలతో కన్నెస్వాములు

పోరుమామిళ్ల: స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి అయ్యప్పస్వామి గ్రామోత్సవం బుధవారం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి దేవస్థానం, అమ్మవారిశాల మీదుగా వేణుగోపాలస్వామి దేవస్థానం వరకు సాగింది. ఊరేగింపులో డీజే కోలాటం, తీన్‌మార్ డప్పులు, సన్నాయి మేళం అందరినీ అకర్శించింది. నాలుగు మండలాల నుండి అయ్యప్పదీక్షలో ఉన్నవారు ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపులో కలశాలతో కన్నెస్వాములు దీపాలు పట్టుకుని నడిచారు. రాత్రి వేణుగోపాలస్వామి ఆలయంలోని అయ్యప్ప గుడి ముందు అష్టాదశ పడిపూజ నిర్వహించారు.

పార్టీని బలోపేతం చేద్దాం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



అర్జీలు పరిశీలిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పోరుమామిళ్ల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పార్టీని బలోపేతం చేద్దామని ఎంపీ అవినాష్ రెడ్డి తెలిపారు. పార్టీకి కార్యకర్తలు గుండెకాయ లాంటి వారని, ప్రజలు పట్టుకొమ్మలని మళ్లీ ప్రజల దగ్గరకు వెళ్లి సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రతి కార్యకర్త వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుడే అన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసేది వైఎస్సార్‌సీపీనే అన్నారు. ఏ ఒక్కరూ మనోధైర్యం కోల్పోవద్దన్నారు. ఎమ్మెల్సీ గోవింద రెడ్డి సమస్యలు వివరించారు. పోరుమామిళ్ల చెరువు నుండి గానుగపెంటకు వెళ్లే కాలువ నుండి రాజాసాహెబ్‌పేట చెరువుకు నీరు ఇవ్వాలని రైతులు కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుతో నీరు అందించవచ్చన్నారు. ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా స్కీమ్ మంజూరుకు కృషి చేస్తానని, కాకపోతే ఎంపీ ఫండ్స్ నుండి రూ.10 లక్షలు కేటాయించి పని చేయిస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్ ప్రారంభం: పట్టణంలోని ప్రధాన రహదారిలో శుభమస్తు షాపింగ్‌మాల్‌ను బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలు ప్రారంభించారు. వారి వెంట వ్యవసాయ ఉద్యానవన శాఖ సలహాదారు సంబటూరి ప్రసాదరెడ్డి, బద్వేలు మునిసిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, ఆప్కాస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, సర్పంచులు రమణారెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మానసిక దృఢత్వం అవసరం

ఖాజీపేట: దివ్యాంగ పిల్లలకు మానసిక దృఢత్వం అవసరమని, అప్పుడే పిల్లలు అనుకున్న లక్ష్యలను అందుకోగలరని ఎంఈఓ స్వర్ణలత అన్నారు. ఖాజీపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివ్యాగుల్లో సృజనాత్మకతను గుర్తించాలన్నారు. అందుకు తగ్గట్టుగా వారిని తీర్చి దిద్దితే ఉన్నతికి చేరుతారన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

మైదుకూరు: మైదుకూరులో జాతీయ ఉద్యాన పరిశోధన, అభివృద్ధి కేంద్రం (ఎన్‌హెచ్ఆర్‌డీఎఫ్, ఉల్లి పరిశోధనా కేంద్రం) ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బుధవారం వినతి పత్రం అందజేసినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మైదుకూరులో నాఫెడ్ ఆధ్వర్యంలో 1986లో ఉల్లి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, 2007లో 40వ నేషనల్ హైవే విస్తరణలో కేంద్రానికి చెందిన 10 ఎకరాల భూమి పోయిందని పేర్కొన్నారు. సంస్థను కర్నూలుకు తరలించారని తెలిపారు. మైదుకూరు ప్రాంత రైతులు 2018లో కోరిన మేరకు మైదుకూరులో తిరిగి ఉల్లి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు నాఫెడ్ అంగీకరించిందన్నారు. ఇందు కోసం వనిపెంట రెవెన్యూ గ్రామ పరిధిలోని భూమి అణువుగా ఉందని తేల్చినట్టు తెలిపారు. అది తెలుగుగంగ భూమి అయినందు వలన జల వనరుల శాఖ భూమిని కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. సదరు భూమిని కేటాయించాల్సిందిగా జల వనరుల శాఖను ఆదేవించి భూ కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న ఈఈ భరణి కృష్ణ

దువ్వూరు: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద గృహాల పైకప్పులపై సోలార్ రూఫ్‌టాప్‌లు నిర్మించుకోవడం కోసం బుధవారం మండలంలోని పుల్లారెడ్డిపేట విద్యుత్ కార్యాలయంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మైదుకూరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గానికి ఆదర్శ సోలార్ గ్రామాల కింద ఆరు గ్రామాలను ఎంపిక చేశామని, అందులో దువ్వూరు ఒకటని తెలిపారు. ఒక ఇంటికి ఒక కిలో వాట్ నుంచి గరిష్టంగా 3 కిలో వాట్లకు సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవచ్చన్నారు. ఒక కిలో వాట్‌కు రూ.80వేలు ఖర్చు అవుతుందన్నారు. అందులో కేంద్ర ప్రభుత్వం రూ.30వేలు రాయితీ ఇస్తుందని, రూ.60వేలు బ్యాంకులు రుణం అందిస్తాయని తెలిపారు. ఒక కిలోవాట్‌కు 120 యూనిట్లు ఉత్పత్తి అవుతుందన్నారు. వినియోగదారుడు వాడుకున్న యూనిట్లు పోను మిగతా సోలార్ యూనిట్లను వారి నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వినియోగదారుడికి రూ.1000 సాధారణ విద్యుత్ బిల్లు వస్తే ఈ సోలార్ యూనిట్ ద్వారా రూ.338 బిల్లు వస్తుందన్నారు. ఎబ్ స్టేషన్ కు వచ్చిన విద్యుత్‌కు ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుందన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మైదుకూరు విద్యుత్ డివిజన్ డీఈఈ శ్రీనివాసులరెడ్డి, దువ్వూరు ఏఈ వీరారెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ రమణ, లైన్‌మెన్ రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన

గోపవరం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై గురువారం ఉదయం 11 గంటలకు బద్వేలు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ కుళాయప్ప, ఏఈలు చిన్నయ్య, శివకుమార్‌లు తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులు ఇంటిపై సోలార్‌ను బిగించుకోవడం వలన విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చని డీఈఈ తెలిపారు. మండలంలోని ఆసక్తి కలిగిన రైతులు, వినియోగదారులు ఈ అవగాహన కార్యక్రమానికి హాజరై మరింత సమాచారం తెలుసుకోవాలని ఆయన కోరారు.

ప్రొద్దుటూరులో భారీ వర్షం



ప్రొద్దుటూరు: గాంధీ రోడ్డులో ప్రవహిస్తున్న వర్షం నీరు

ప్రొద్దుటూరు రూరల్: వారం రోజులుగా ఫెంగల్ తుపాను రాష్ట్రాన్ని వణికిస్తున్నప్పటికీ ప్రొద్దుటూరులో మాత్రం జల్లుల వాన పడిపోయింది. దీంతో ప్రొద్దుటూరు మండల పరిధిలోని గ్రామాల్లో రైతులకు ఏమి నష్టం జరగలేదు. అయితే బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రొద్దుటూరు మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలో 2 వేల ఎకరాలకుపైగా వరి పంట నూర్పిళ్లు జరగాల్సి ఉంది. వారం రోజుల కిందటే నూర్పిళ్లు చేయాల్సి ఉండగా వ్యవసాయశాఖ, వాతావరణ శాఖల సూచనల మేరకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. ఈ భారీ వర్షానికి నూర్పిళ్ల ఖర్చు బాగా పెరుగుతుందని, వరి గడ్డి చేతికి రాదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం చొరవ చూపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పొంగి ప్రవహించిన మురికి కాలువలు

ప్రొద్దుటూరు: పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం పడింది. పట్టణంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. భారీ వర్షం పడటంతో నీటి ఉధృతికి మురుగు కాలువలోని మురికి నీరు రోడ్లపై చేరింది. గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం నుంచి వెంకటేశ్వర థియేటర్ వరకు మురికి నీరు కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివేకానంద క్లాత్ మార్కెట్ వద్ద వర్షం నీరంతా నిలబడటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సుమారు గంట పాటు వర్షం పడింది.

నీటమునిగిన వరి, మినుము పంటలు

కలసపాడు: మండలంలోని చెన్నుపల్లె గ్రామంలో మంగళవారం కురిసిన వర్షానికి చెన్నుపల్లె, గోపవరంపల్లె గ్రామాల్లో మినుము, వరిపంట నీట మునిగాయని వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు. 60 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో మినుము పంట నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రాథమిక అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిచామన్నారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

ప్రొద్దుటూరు: జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వంపై అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఒత్తిడి తేవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో కడప ఉక్కు పరిశ్రమపై ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఆ ప్రతిపాదన తమ వద్ద లేదని చెప్పడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఉక్కు పరిశ్రమ కోసం రాష్ట్రంలోని ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.


ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్: మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన టీటీ ఎఫ్‌డీ ప్రైవేట్ లిమిటెడ్ వారు జావా ఫుల్‌స్టాక్ డెవలపర్ ట్రైనీ ఉద్యోగాకు నిర్వహించిన ఎంపికల్లో షేక్ బాసిద్ అహ్మద్, బండి సురేష్, నిఖితలు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. వీరికి ఏడాదికి రూ.4.6లక్షల వేతనం ఉంటుందన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మలేరియా నివారణాధికారి

చాపాడు: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జోనల్ మలేరియా నివారణాధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి కుంటల్లో నిల్వ నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమల వ్యాప్తి జరుగకుండా లార్వా దశలోనే వాటిని నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైడే ఫ్రైడే పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, ఓబులేసు, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, ఆశా నోడల్ అధికారి సుకన్య, సూపర్‌వైజర్‌లు సరస్వతి, బాబు రెడ్డి, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించండి



పాత అట్లూరులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

అట్లూరు: రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, కడప ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.అంకయ్యకుమార్ తెలిపారు. మండలంలోని పాత అట్లూరు, బీబీసాహేబ్‌పేట గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యాక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పాత అట్లూరు గ్రామ రైతులు అధికంగా క్రాసింగ్ జొన్న సాగు చేశారని అయితే రైతులు సంబంధిత కంపెనీ ప్రతి నిధులతో అవగాహణ ఒప్పందం తప్పనిసరిగా కుదుర్చుకోవాలన్నారు. రైతులు సాగు చేసిన జొన్నకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా ఎకరాకు రూ.315 చెల్లించి పంటనమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం బీబీ సాహేబ్‌పేట గ్రామంలో సాగు చేసిన ఎర్ర జగిత్యాల వరిరకంను పరిశీలించి పంటకోత ప్రయోగం శాస్త్రీయంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముసల్‌రెడ్డిపల్లెలో పొలం పిలుస్తోంది

కలసపాడు : మండలంలోని ముసల్‌రెడ్డిపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, వివిధ పంటలలో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ డి.పావని, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నసింగనపల్లెలో 'పొలం పిలుస్తోంది'

దువ్వూరు: మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీ పంట కాలనికి మండలంలో విస్తారంగా మినుము పంటను సాగు చేశారని తెలిపారు. పంటకు పల్లాకు తెగులు సోకిందని, తెగులు సోకిన మొక్కలను పొలం నుంచి తొలగించాలని సూచించారు. తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక నివారణకు మొదటి పిచికారిలో వేపనూనె 1500 పీపీఎం- 5 ఎంఎల్‌తో పాటు సబ్బు పొడర్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు: రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ ఎం.మాణిక్యరాజు డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాణిక్యరాజు మాట్లాడుతూ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సరి చేసి రీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. అన్ని యూనివర్సిటీలకు ఉపకులపతులను వెంటనే నియమించాలన్నారు.

నేత్రదానం

ఖాజీపేట: ఖాజీపేట మండలం పత్తూరు గ్రామానికి చెందిన బాలినేని సుబ్బమ్మ (60) బుధవారం తెల్లవారు జామున గుండె నొప్పితో కడపలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తీసుకు వెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందడంతో ఇంటికి తీసుకువచ్చారు. తల్లి కోరిక మేరకు ఆమె కళ్ళను దానం చేయాలని కడపలోని పుష్పగిరి ఐ కేర్ వారికి సమాచారం ఇచ్చారు. వారు ఇంటి వద్దకు వచ్చి ఆమె కళ్ళను సేకరించి తీసుకెళ్లారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

చాపాడు: మండల వ్యాప్తంగా ఈ నెల 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకూ గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దారు రమాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న కేతవరం, 7న నెర్రవాడ, 10న పల్లవోలు, 11న ఖాదర్‌పల్లె, 12న మడూరు, 13న అన్నవరం, 17న సోమాపురం, 18న మొర్రాయిపల్లె, 19న పిచ్చపాడు, 20న చియ్యపాడు, 21న వెంగన్నగారిపల్లె, 24న తుమ్మలపాడు, 26న చిన్నగురువళూరు, 27న బూడిదపాడు(పెద్దగురువళూరులో), 28న కుచ్చుపాప, 31న చాపాడులో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే వచ్చే ఏడాది జనవరి 2న పెద్దగురువళూరు, 3న వెదురూరు, 4న బద్రిపల్లె, 7న అనంతపురం, 8న అల్లాడుపల్లె గ్రామాలలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

కలసపాడు: మండలంలో శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు మధురవాణి బుధవారం తెలిపారు. ఈ సదస్సులను భూముల పరిష్కారం కోసం నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దువ్వూరు: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు దువ్వూరు తహసీల్దార్ అక్బల్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుని వారి భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను కచ్చితగా పరిష్కరమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. కోనేటి కాలువ వీధిలో మురికి కాలువలో పేరుకుపోయిన షీల్ట్‌ను సిబ్బందితో కమిషనర్ తీయించారు. ఇస్లాంపురం వీధిలో నీటి సరఫరా సమయం పెంచాలని ప్రజలు కమిషనర్‌ను కోరగా, ఈ సమస్యను పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న కట్టెల డిపో వారు మురికి కాలువను ఆక్రమించారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని యజమానులను కమిషనర్ ఆదేశించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు, నూర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు సమ్మెలో పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్, నాణ్యమైన పనిముట్లు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని తెలిపారు. చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కరోనా కార్మికులకు ప్రతి నెల వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

మున్సిపల్ అధికారుల విచారణ

ప్రొద్దుటూరు: గత ప్రభుత్వంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, బర్త్ అండ్ డెత్ విభాగాల్లో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. అనంతపురం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ విశ్వనాథ్, టౌన్ ప్లానింగ్ ఆర్జీ సంజీవ్ కుమార్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో విచారించారు. నూతన కూరగాయల మార్కెట్‌లో సిమెంటు రోడ్లకు సంబంధించిన నాణ్యత, ఇతర పనులను వారు పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని సంబంధిత అధికారులు తెలిపారు. వార్డు సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అధికారులు పాల్గొన్నారు.